# కుటుంబాన్ని కబళించిన ఆర్థిక ఇబ్బందులు

- సిద్దిపేట కలెక్టర్ గన్‌మెన్ నరేశ్ బలవన్మరణం
- భార్యా ఇద్దరు పిల్లలను గన్‌తో కాల్చి.. తాను కాల్చుకుని ఆత్మహత్య
- చిన్నకోడూరు మండలం రామునిపట్ల గ్రామంలో ఘటన
- పూర్తి స్థాయిలో విచారించి వివరాలు వెల్లడిస్తాం: సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత



మృతదేహాలను చూసి రోదిస్తున్న కుటుంబీకులు



చైతన్య, నరేశ్‌ల మృతదేహాలు

సిద్దిపేట, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ చిన్నకోడూరు/ సిద్దిపేట అర్బన్ : ఆర్థిక ఇబ్బందులు ఆ కుటుంబం ఉసురుతీశాయి. ప్రభుత్వోద్యోగి అయినా కొన్ని అనివార్య కారణాలతో చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక, పరువుపోతుందేమోననే భయాందోళనలో ఆ కుంటుంబం బలవన్మరణానికి పాల్పడ్డ ఘటన చిన్నకోడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. భార్య, ఇద్దరు పిల్లలను గన్‌తో కాల్చి, తాను కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనతో రామునిపట్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసులు, స్థానికులు, కుటుంబీకుల కథనం ప్రకారం.. సిద్దిపేట కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ వద్ద (పీఎస్‌వో) గన్‌మెన్‌గా పనిచేస్తున్న 2013వ బ్యాచ్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ (పీసీ నం.2735) ఆకుల నరేశ్‌కు భార్య చైతన్య (30), కుమారుడు రేవంత్ (6), కుమార్తె రిషిత (5) ఉన్నారు. చిన్నకోడూరు మండలం రామునిపట్ల గ్రామానికి చెందిన ఆకుల రాములు, లక్ష్మి దంపతులకు ముగ్గురు కుమారులు. వీరిలో పెద్ద కొడుకు ఆకుల నరేశ్, రెండో కుమారుడు సురేశ్, మూడో కొడుకు శ్రీకాంత్. నరేశ్, సురేశ్ ఇద్దరూ 2013లో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. చిన్నవాడు శ్రీకాంత్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. శ్రీకాంత్‌కు వివాహం కాలేదు. ఐదేండ్లుగా సిద్దిపేట కలెక్టర్‌కు గన్‌మెన్ (పీఎస్‌ఓ)గా విధులు నిర్వహిస్తున్నాడు. భార్యాపిల్లలతో సిద్దిపేటలోనే నివాసముండేవాళ్లు. 20 రోజుల కిందట సొంతగ్రామం రామునిపట్లకు మకాం మార్చారు. అప్పటి నుంచి రోజూ ఇక్కడి నుంచి విధులు నిర్వహిస్తున్నాడు. చైతన్య తాను పనిచేస్తున్న పాఠశాలకు పిల్లలను బస్సులో తీసుకెళ్లి, వస్తుండేది.

**ఆస్తి పంచివ్వాలని ..**

నరేశ్ చేసిన అప్పుల విషయంలో కుటుంబంతో ఐదారు నెలలుగా గొడవలు జరుగుతున్నాయి. వారికి రెండెకరాల భూమి ఉంది. ఇటీవలే నరేశ్ తనకు అప్పులు బాగా పెరిగాయని, తన ఆస్తి పంచి ఇవ్వాలని తల్లిదండ్రులను అడిగాడు. నరేశ్ మాట విన్న తల్లిదండ్రులు ఒక ఎకరం అమ్మి అందులోంచి నీ వాటా తీసుకోమని అమ్మారు. ఎకరం పొలాన్ని అమ్మగా రూ.42 లక్షలు వచ్చాయి. అందులోంచి నరేశ్ వాటా రూ.30 లక్షలు ఇచ్చారు. వాటిని అప్పుల వాళ్లకు కట్టినట్లు సమాచారం. మిగితా డబ్బు కూడా ఇస్తే మిగిలిన అప్పులు కడతానని తల్లిదండ్రులతో నరేశ్ గొడవపడ్డాడు. ఈ తీరుగా ఎందుకు అప్పులు అయ్యాయి? మొత్తం నీ అప్పులు కడితే మిగితా ఇద్దరి పరిస్థితి ఏంటి అని తల్లిదండ్రులు నరేశ్‌ను నిలదీశారు. అప్పటికే మితిమీరిన అప్పుల ఊబిలో కురుకుపోయిన నరేశ్‌పై అప్పులిచ్చిన వాళ్ల నుంచి ఒత్తిడి ఎక్కువైంది. ప్రభుత్వోద్యోగిగా అప్పుల వాళ్లు నిలదీస్తే పరువుపోతుందని భావించి మానసిక ఒత్తిడికి లోనయ్యేవాడు. శుక్రవారం సిద్దిపేట కలెక్టర్ వద్ద డ్యూటీలో ఉన్న నరేశ్ నేరుగా తన భార్యకు ఫోన్ చేసి పిల్లలను స్కూల్‌కు పంపవద్దని, తాను వస్తున్నానని చెప్పాడు. ఇంటికి వచ్చి రాగానే తన వద్ద ఉన్న సర్వీస్ రివాల్వర్‌తో భార్యాపిల్లలను కాల్చి, తాను కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఏసీపీ సురేందర్‌రెడ్డి, ఇతర పోలీస్ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఆర్థిక సమస్యలే ఆత్మహత్యకు కారణమని ప్రాథమికంగా నిర్దారించినట్లు సీపీ శేత్వ తెలిపారు. నరేశ్ డ్యూటీలో ఉండగానే ఘటన జరిగిందని, ఫోన్ స్వాధీనం చేసుకున్నామని, విచారించి వివరాలు వెల్లడిస్తామని సీపీ శ్వేత తెలిపారు. పోస్టుమార్టం కోసం సిద్దిపేటలోని జిల్లా దవాఖానకు తరలించారు.

**ఆర్థిక పరిస్థితులే కారణమని నిర్దారణ**

ఏఆర్ కానిస్టేబుల్ ఆకుల నరేశ్ ఆత్మహత్యకు ఆర్థిక ఇబ్బందులే కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. నరేశ్ తరుచూ ఆన్‌లైన్ బెట్టింగ్‌లు వేయడంతోనే అప్పుల ఊబిలో కూరుకుపోయాడని స్థానికులు ఇచ్చిన సమాచారాన్ని బట్టి తెలుస్తున్నది. ఆన్‌లైన్ బెట్టింగ్‌తో సుమారు 80 లక్షల వరకు అప్పు చేసినట్లు సమాచారం.భార్యాభర్తల మధ్య గొడవతో భార్యాపిల్లలను కాల్చి, తాను కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడని తెలుస్తున్నది. ఈ మేరకు సీపీ శ్వేత, ఏసీపీ సురేందర్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

కొమురవెల్లి, డిసెంబర్ 15: ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. శుక్రవారం కొమురవెల్లిలోని డంపింగ్ యార్డ్‌ను డీపీవో దేవకీదేవితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డంపింగ్ యార్డులోని ప్లాస్టిక్‌ను వేరు చేయాలని సూచించారు. కొమురవెల్లి మల్లన్న ఆలయానికి సంబంధించిన డంపింగ్ యార్డును మరో ప్రాంతంలో ఏర్పాటు చేయాలన్నారు. కొమురవెల్లి పరిసరాల్లో దుకాణదారులు జూట్ బ్యాగులు వాడేలా చూడాలన్నారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. క్లాస్ రూమ్‌లోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చాటించారు. ఉదయం పూట పాఠశాలలో అల్పాహారం ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సిలువేరు సిద్దప్ప, మల్లన్న ఆలయ ఈవో బాలాజీ, డీఎల్‌పీవో మల్లికార్జున్‌రెడ్డి, స్వచ్ఛ కొమురవెల్లి ఇన్‌చార్జి ఆఫీసర్ మాధవి, ఎంపీవో మంజుల, పంచాయతీ కార్యదర్శి లోకేశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్

**'మల్లన్న'ను దర్శించుకున్న అడిషనల్ కలెక్టర్**

చేర్యాల, డిసెంబర్ 15: కొమురవెల్లి మల్లికార్జున స్వామిని సిద్దిపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆమెకు ఈవో బాలాజీ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు అడిషనల్ కలెక్టర్‌కు స్వామి వారి ప్రసాదం అందజేశారు. ఆమెతో ఏఈవో వైరాగ్యం అంజయ్య, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, సూపరింటెండెంట్ నీల శేఖర్ ఉన్నారు.

# ఆర్టీసీ బస్సులకు ఫాస్టాగ్ కష్టాలు



తాడ్దాన్‌పల్లి టోల్‌ప్లాజావద్ద నిలిచిపోయిన ఆర్టీసీ బస్సులు

అందోల్, డిసెంబర్ 15: సంగారెడ్డి నుంచి జోగిపేట– నారాయణఖేడ్–జోగిపేటకు వెళ్లే ఆర్టీసీ బస్సులు తాడ్దాన్‌పల్లి (సింగూర్ క్రాస్‌రోడ్డు) టోల్ ప్లాజా వద్ద శుక్రవారం నిలిచిపోయాయి. టోల్ చార్జీలు చెల్లించేందుకు ఫాస్టాగ్‌లో డబ్బులు లేక బస్సులు నిలిపేసినట్లు టోల్‌గేట్ సిబ్బంది తెలిపారు. దీంతో బస్సుల్లోఉన్న ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఇదే పరిస్థితి నెలకొన్నది. దీంతో కొంత మంది ప్రయాణికులు ఆర్టీసీ సిబ్బంది, టోల్ ప్లాజా సిబ్బందితో గొడవకు దిగారు. ఉన్నతాధికారులు స్పందించి టోల్‌ప్లాజా సిబ్బందితో మాట్లాడగా కొన్ని సర్వీసులను వదిలినా, చాలా బస్సులు డబ్బులు చెల్లించాకే వదిలిపెట్టారు. ఈ విషయంపై ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ప్రభులతతో మాట్లాడగా ఫాస్టాగ్‌లో చిన్నచిన్న సాంకేతిక లోపాలు ఏర్పడడంతో కొన్ని బస్సులకు టోల్‌గేట్ దగ్గర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు.

# పల్లెప్రగతితో స్వర్గసీమలుగా గ్రామాలు

## సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజారాధాకృష్ణ శర్మ

కొమురవెల్లి, డిసెంబర్ 15: పల్లెప్రగతితో గ్రామాలు స్వర్గసీమలుగా మారాయని, కేసీఆర్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేసిందని సిద్దిపేట జడ్పీచైర్‌పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణశర్మ అన్నారు. శుక్రవారం కొమురవెల్లి మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ తలారి కీర్తనాకిషన్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజారాధాకృష్ణశర్మ మాట్లాడుతూ మిషన్ భగీరథ శుద్ధమైన నీరు, కేసీఆర్ ప్రభుత్వం ఇంటింటికీ నల్లాల ద్వారా అందించిందన్నారు. మిషన్ భగీరథ నీళ్లను పాఠశాలలో విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు తాగేలా కృషి చేయాలన్నారు. ప్రజల అభీష్టం మేరకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సిలువేరు సిద్దప్ప, చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్, ఎంపీడీవో అనురాధ, వైస్ ఎంపీపీ రాజేందర్‌రెడ్డి, ఎంపీవో మంజుల తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజారాధాకృష్ణశర్మ

# నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం



అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లకు అవిశ్వాస తీర్మానం అందజేస్తున్న కౌన్సిలర్లు

మెదక్, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళి యాదవ్‌పై కౌన్సిలర్లు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లకు శుక్రవారం మెజార్టీ సభ్యులు అవిశ్వాస తీర్మాన నోటీసు అందజేశారు. నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీ యాదవ్ బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన విషయం తెలిసిందే. నర్సాపూర్ మున్సిపాలిటీలో 15మంది కౌన్సిలర్లు ఉన్నారు. నాలుగేండ్ల అనంతరం మున్సిపల్ చైర్మన్‌పై బీఆర్ఎస్‌కు చెందిన వైస్ చైర్మన్ నయీమోద్దీన్, కౌన్సిలర్లు అశోక్‌గౌడ్, ఇస్రత్ సిద్ధికి, గొల్ల రుక్కమ్మ, పంబాల రాంచందర్, ఒంటెద్దు సునీత, లక్ష్మి, సరిత, లలిత అవిశ్వాస తీర్మాన నోటీసును అదనపు కలెక్టర్‌కు అందజేశారు.

# పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలి

మెదక్ అర్బన్, డిసెంబర్ 15: పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలని మెదక్ ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పెండింగ్ కేసులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసుల్లో ఏవిధంగా ఇన్వెస్టిగేషన్ చెయ్యాలి, ఏయే అంశాలు క్రోడీకరించాలో వివరించారు. ప్రతి అధికారికి స్టేషన్ మేనేజ్‌మెంట్ తెలిసి ఉండాలన్నారు. కేసుల ఛేదనలో అత్యాధునిక టెక్నాలజీ ఉపయోగించాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్, డీఎస్పీ ఫణీంద్ర, తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, ఎస్‌బీసీఐ దిలీప్‌కుమార్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు

# బాధితులకు నష్టపరిహారం అందజేత



బాధితులకు చెక్కు అందజేస్తున్న జిల్లా జడ్జి లక్ష్మీశారద

మెదక్ అర్బన్, డిసెంబర్ 15: జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ పి.లక్ష్మీశారద ఆధ్వర్యంలో జిల్లా న్యాయస్థానముల సముదాయంలో స్పెషల్ లోక్ అదాలత్‌ను శుక్రవారం నిర్వహించారు. యాక్సిడెంట్ కేసుల్లో రూ.కోటి ఇన్సురెన్స్ వారు బాధితులకు నష్ట పరిహారం చెల్లించినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు బాలయ్య, కిరణ్, చోలా ఇన్సురెన్స్ మేనేజర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సునీతారెడ్డితోనే అభివృద్ధి




పైతర దేవాలయంలో కొబ్బరికాయలు కొడుతున్న రవితేజరెడ్డి, గ్రామస్తులు

కొల్చారం, డిసెంబర్ 15: నర్సాపూర్ ఎమ్మెల్యేగా సునీతారెడ్డి గెలుపొందడంతో కొల్చారం మండలంలోని పైతర గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యూత్, నాయకుడు రవితేజరెడ్డి శుక్రవారం మొక్కులు సమర్పించుకున్నారు. ఎమ్మెల్యేగా సునీతారెడ్డి గెలిస్తే పైతరలోని భ్రమరాంబిక మల్లికార్జునస్వామి దేవాలయంలో 51 కొబ్బరికాయలు కొడుతానని మొక్కుకున్నానని, శుక్రవారం గ్రామస్తులతో మొక్కు చెల్లించుకున్నానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సంతోష ఎల్లేశం, మాజీ సర్పంచ్‌లు భానుప్రకాశ్‌రెడ్డి, మురళీగౌడ్, ఎంపీటీసీ ఎల్లయ్య, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు మల్లేశం పాల్గొన్నారు.

# రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న మహారాష్ట్ర భక్తులు

మద్దూరు(ధూళిమిట్ట), డిసెంబర్ 15: సిద్దిపేట జిల్లాలోని ధూళిమిట్ట మండలం బెక్కల్ రామలింగేశ్వరస్వామిని మహారాష్ట్రకు చెందిన పలువురు భక్తులు శుక్రవారం దర్శించుకున్నారు. మహారాష్ట్ర షోలాపూర్‌కు చెందిన రమేశ్, బాలకృష్ణ, ఘుర్‌దాస్ కుటుంబాలకు చెందిన సుమారు 50మంది ఆలయ అర్చకుడు సిద్దాపురం శివప్ప ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.